

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

సిఎం సారూ.. ఇటు చూసేరా..?

• జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు • నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు నగరంలో పర్యటించనున్నారు. సి క్యాంప్ రైతు బజార్‌ను సందర్శించి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పార్కుకు భూమి పూజ చేయనున్నారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు...

• తప్పని వలస వెతలు

ఏళ్ల గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

• సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్రం

జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

• సాగు, తాగు నీటికి తిప్పలే

ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హాళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తి అయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

• ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసల్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు.

నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

• కర్నూలులో కాలుష్య కారకం..

- గూండాల పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలో పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ తండ్రి, మాజీ ఎంపీ టిజి వెంకటేష్‌కు చెందిన టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ 152.4 హెక్టార్లలో ఉంది. ప్రస్తుతం ఉన్న పరిశ్రమ సైట్ విస్తీర్ణంలోనే కాస్టిక్, కోరో మీథేన్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి, పాలీ టెట్రా ఫ్లోరో ఎథిలీన్ (పిటిఎఫ్ఇ), క్లోరినేటెడ్ పాలీ వినైల్ క్లోరైడ్ (సిపివిసి), పాలీ అల్యూమినియం క్లోరైడ్ (పిఎసి), హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్లాంట్లను స్థాపించాలని ప్రతిపాదించారు. పరిశ్రమ యాజమాన్యం సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో అనేక లోపాలు ఉన్నాయి. ప్రజలకు అవగాహన కల్పించే ముఖ్య సమాచారం అందులో లేదు. సంస్థ తయారుచేసే పాలిటెట్రాఫ్లోరోఇథలిన్ (పీటీఎఫ్ఈ) రసాయన ప్రక్రియలో పెర్‌ఫ్లోరోక్టానాయిక్ (పీఎఫ్ఏఎస్), కార్బన్ టెట్రాక్లోరైడ్ (సీసీఎల్4) వంటి ప్రమాదకరమైన రసాయనాలు వెలువడతాయి. ఈ రసాయనాల నిల్వ, వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి నివేదికలో ఎటువంటి సమాచారం లేదు. ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారు. ఈ పరిశ్రమల తయారీలో ఉపయోగించే సర్ఫెక్టెంట్ల వల్ల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పరిశ్రమ తెలంగాణ సరిహద్దులో ఉన్నందున, దీని ప్రభావం అక్కడి ప్రజలపై కూడా ఉంటుంది. ఈ పరిశ్రమ విస్తరణ వల్ల కర్నూలు నగరానికి సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణ , తుంగభద్ర నదుల నీటి వనరులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. పరిశోధనలో పిఎఫ్ఎఎస్ రసాయనం ప్రమాదాలు వెల్లడైన తర్వాత కూడా ఈ పరిశ్రమకు అనుమతిస్తే, కృష్ణా నది నీరు తాగడానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. దీనికి సంబంధించి బుధవారం పరిశ్రమ ఆవరణంలో చేపట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రయివేటు గూండాల పర్యవేక్షణలో జరిగింది. అభిప్రాయాలను తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులను బయటకు ఈడ్చుకెళ్లారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘు వేంద్రపై దాడికి పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని, కాలుష్య పరిశ్రమ విస్తరణకు అనుమతి ఇవ్వకూడదని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ అంశంపై మాట్లాడతారో లేదో చూడాలి.



టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం ప్రజా వేదిక, సి క్యాంప్ రైతు బజార్, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర పార్క్ భూమి పూజ కార్యక్రమాలకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ , ఎపి సిఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యటన ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్పిలు సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

-ఎస్‌పి విక్రాంత్ పాటిల్ -1700 మంది పోలీసులతో భారీ బందోబస్తు
-పోలీసులు అప్రమత్తంగా ఉండాలి - పోలీసులకు ఎస్‌పి దిశా నిర్దేశం

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం నియమించిన పోలీసులకు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయంకు ఎదురుగా ఉన్న మెగా సిరి ఫంక్షన్ హాలులో పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ... కర్నూలు పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటించే రూట్ రూఫ్ – టాప్ ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, సభ ప్రాంగణం, తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. చేయకూడనవి, చేయాల్సిన వాటికి గురించి తెలిపారు. అడిషనల్ ఎస్పిలు నలుగురు, 11 మంది డిఎస్‌పిలు, 53 మంది సిఐలు, 101 మంది ఎస్ఐలు, 383 మంది ఎఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్ళు, 680 మంది కానిస్టేబుళ్ళు, 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హోంగార్డులు, 5 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, ఆరుస్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. కర్నూలు జిల్లా ఎస్పితో అడిషనల్ ఎస్‌పిఅడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నగరంలో ట్రాఫిక్ నేడు మళ్లింపు : నేడు నగరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ మళ్లింపు చర్యలను చేపట్టారని కర్నూలు టౌన్ డిఎస్‌పి జె.బాబుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుండి సాయంకాలము 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో ఉంచుకొని వాహనదారులు పోలీసు వారు తెలిపిన ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని ఆయన ప్రజలను కోరారు.

- ఆత్మకూరు, నందికొట్కూరు నుండి వచ్చు వాహనాలు గార్గేయపురం ఎన్‌హెచ్350 మీదుగా సఫా కాలేజీ, రింగు రోడ్, గుత్తి పెట్రోల్ బంక్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టిసి బస్టాండ్ కు వెళ్లాలి.
- నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ వైపు వెళ్ళు వాహనాలు ఆర్‌టిసి బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంక్, రింగురోడ్ సఫ్బా కాలేజ్ మీదుగా ఎన్‌హెచ్ 40 , ఎన్‌హెచ్ 350 సి హైవేల నుండి వెళ్లాలన్నారు.
- డోను, అనంతపురం వైపు నుండి వచ్చు వాహనములు గుత్తి పెట్రోల్ బంకు, చేన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆటిసి బస్టాండ్ కు వెళ్లాలి. ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న తమకు సంబంధించిన వారికి, బంధువులకు కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఉన్న విషయం తెలియజేసి వారి మార్గం సుగమం చేసుకొని ప్రయాణించి పోలీసువారికి సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూల్ డిఎస్‌పి బాబు ప్రసాద్ తెలిపారు.



సమావేశానికి హాజరయిన పోలీసులు



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నగరంలో తిరంగా యాత్ర

• జడ్పీ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన • పాల్గొన్న మంత్రి టీజీ భరత్ ఇతర కూటమి నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల త్రివిద దళాలకు అభినందనలు తెలుపుతూ కర్నూలులో శుక్రవారం తిరంగాయాత్రలను నిర్వహించారు. జిల్లా పరిషత్తు కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు జాతీయ జెండాలను పట్టుకుని ప్రదర్శన చేస్తూ యాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టిడిపి జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్ కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కెవి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ సంజీవ్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను హతమార్చడంలో త్రివిధ దళాలు చేసిన కృషి అభినందనీయమన్నారు. దేశ రక్షణలో యువకులందరూ భాగస్వామ్యం కావాలని వారు కోరారు.

విద్యుద్ఘాతంతో కారు డ్రైవర్ మృతి

-కారు యజమాని నిర్లక్ష్యంతో దుర్మరణం -డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువుల డిమాండ్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా సుల్తానాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు(35) ఎనిమిది సంవత్సరాలుగా కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నారాయణరెడ్డి వద్ద కార్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం చిన్నటేకూరు గ్రామ సమీపంలోని తన సొంత పొలానికి కారులో వెళ్లారు. పొలానికి నిర్మించిన గేటు వద్ద అడ్డంగా విద్యుత్ వైరు వేలాడుతూ ఉంది. అక్కడ వాచ్మెన్ లేకపోవడంతో దారికి అడ్డుగా ఉన్న వైరుని తొలగించి ముందుకు వెళ్లాలని కారు డ్రైవర్ శ్రీనివాసులును డాక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. తనకు విద్యుత్ గురించి సరిగా తెలియదని వాచ్మెన్ వచ్చేవరకు ఉందామని చెప్పినా డాక్టర్ నారాయణ రెడ్డి వినలేదు. తప్పని పరిస్థితిలో విద్యుత్ తీగ తొలగించేందుకు కార్ డ్రైవర్ శ్రీనివాసులు వెళ్లాడు. ఆ విద్యుత్ తీగకు విద్యుత్ సరఫరా అవుతుందని తెలియని కారు డ్రైవర్ శ్రీనివాసులు తీగను పక్కకు లాగాడు వెంటనే విద్యుత్ ఘాతం తగిలి కుప్పకూలిపోయాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేదు. అప్పటికే కార్ డ్రైవర్ మతి చెందారని వైద్యులు తెలిపారు. సుల్తానాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. వారు కల్లూరు అర్బన్ కృష్ణానగర్‌లో ఒక ఇంటిని అద్దెకి తీసుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని బంధుమిత్రులు డాక్టర్ నారాయణరెడ్డిని డిమాండ్ చేస్తున్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌కు ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్పోర్టుకు శుక్రవారం ఇచ్చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, కర్నూల్ ఎంపి బస్తీపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు , టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తదితరులు స్వాగతం పలికారు. కకర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కేంద్రమంత్రి కి ఘనంగా శాలువా మెమొంటోలతో సత్కరించారు. అనంతరం అక్కడే జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులపై చర్చించారు.

రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం నుండి గార్గేయపురంలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని కేతవరం గ్రామంలో నిలిచిపోయిన రోడ్డు పనులను ప్రజాసంఘాల నాయకులు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి జి.శ్రీధర్, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా కేతవరం నుండి గార్గేపురం వరకు రోడ్డు అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. ఆరు నెలల క్రితం ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి వెంటనే నిలిపివేశారన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వెంటనే స్పందించి ఈ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేతవరం పూడిచర్ల గ్రామ ప్రజలందరికీ కలుపుకొని పూడి చర్ల హైవే వద్ద రహదారి దిగ్బంధనం చేస్తామని హెచ్చ రించారు. రేమట సుబ్బరాయుడు, అహ్మద్ రసూల్, మధు, బాలకృష్ణ, స్వాములు, భరతుడు, రాజు, సుబ్బయ్య, జి.వెంకటస్వామి, స్వాములు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి రామకృష్ణ



మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ చిట్టినర్సమ్మ

నిబంధనల మేరకు క్యాంటీన్ అప్పగించాలి

కెఎంసి ప్రిన్సిపల్ చిట్టినర్సమ్మ

ప్రజాశక్తి-కర్నూల్ హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ వ్యవహారంపై శుక్రవారం కాలేజీ లోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన స్టాఫ్‌కౌన్సిల్ సమావేశంలో క్యాంటీన్ లీజు ఐదేళ్లు దాటి చాలా కాలం అయిపోయిందని క్యాంటీన్‌ను తమకు అప్పగించాలని ఎపిజిడిఎ నాయకులు ప్రిన్సిపల్‌ను కోరారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ కాలేజీ క్యాంటీన్ అందరికీ అవసరమైనదని ఇప్పటికే ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఈ వివాదాన్ని త్వరగా ముగిస్తే మంచిదని కోరారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ క్యాంటీన్ వ్యవహారం ఎపిజిడిఎకు క్యాంటీన్ నిర్వాహకులకు మధ్య జరిగిన ఒప్పందం అని చెప్పారు. ఆ ఒప్పంద పూర్తి వివరాల కాపీలు అందచేయాలని సమస్యల విషయంలో ఇప్పటికే కోర్టు పరిధికి వెళ్ళినందున పాత కొత్త సభ్యులందరూ కలిసి కూర్చుని మాట్లాడుకొని సమస్య పరిష్కరించకుంటే మంచిదని అన్నారు. క్యాంటీన్ విషయంలో అందరు సభ్యులు కోరిన విధంగా క్యాంటీన్ త్వరగా ఓపెన్ చేసేందుకు స్టాఫ్ కౌన్సిల్ సభ్యుల కోరిక మేరకు అందుబాటులో ఉన్న అన్ని వివరాలతో జిల్లా కలెక్టర్, డిఎంఇ నివేదిక సమర్పిస్తామన్నారు. తదుపరి వారి ఆదేశాల మేరకు త్వరలో క్యాంటీన్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత క్యాంటీన్ విషయంపై సమస్యలు ఉన్నందున అంతవరకు స్టాఫ్‌కు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మరేదైనా ప్రదేశంలో క్యాంటీన్ నిర్వహణకు అనుమతిస్తే బాగుంటుందని కొందరు సభ్యులు కోరారని తెలిపారు. జనరల్ హాస్పిటల్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ విజయ ఆనంద్ బాబు, హెచ్ఒడిలు సుధా కుమారి, అమీరున్నిసా బేగం, ఎపిజిడి ఎ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు ధామమ్ శ్రీనివాసులు, డాక్టర్ సొమ్మప్ప, డాక్టర్ రామకృష్ణ నాయక్, రామ్ శివ నాయక్, రామ డాక్టర్ మాధవి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అన్యాయం


-స్టడీ లీవ్, ఎస్‌జిటి ఉపాధ్యాయులకు గండం -బదిలీల్లో ఆ స్థానాలను చూపిస్తున్న వైనం
- విద్యాశాఖ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్టడీ లీవ్ మీద రెండు సంవత్సరాల పాటు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు అవకాశం ఉంది. పాఠశాల విద్యాశాఖలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు బిఇడి ఇతర కోర్సులను అభ్యసించేందుకు వెళ్లిన వారికి విద్యాశాఖ ఉన్నతాధికారులు షాక్‌కు గురి చేశారు. జిల్లాలో స్టడీ లీవ్ మీద వెళ్లిన ఎస్‌జిటి ఉపాధ్యాయుల పోస్టులను కూడా ప్రస్తుత బదిలీల్లో చూపించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సదరు ఎస్‌జిటి ఉపాధ్యాయుల స్థానాలను కూడా బదిలీల్లో చూపించడం సరైనది కాదంటూ విద్యాశాఖ తీరుపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ఉన్నత చదువులను వెళ్లేందుకు రెండేళ్ల పాటు చట్టంలో అవకాశం కల్పించింది. స్టడీ లీవ్ మీద రెండు సంవత్సరాల పాటు నేరుగా పూర్తిస్థాయి వేతనం చెల్లిస్తూ వారికి అవకాశం కల్పించారు. జిఒ నెంబర్ 342 ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఉద్యోగ ఉపాధ్యాయులు స్టడీలీవ్ పెట్టుకోవచ్చు. ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా నియమితులైన ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. బిఇడి కోర్సు పూర్తి చేసుకుంటే భవిష్యత్తులో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి మీద వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఈ జీవోద్వారా అనేకమంది ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులు స్టడీలీవ్ మీద వెళ్తున్నారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ప్రస్తుతం ఆన్లైన్ ద్వారా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో స్టడీలీవ్ మీద వెళ్లిన ఉపాధ్యాయుల స్థానాలను కూడా ప్రస్తుత బదిలీల్లో చూపించడం పట్ల హవాక్కయ్యారు. వారి స్థానాలు కూడా బదిలీల్లో పొందుపరచడంతో ఇంకా కోర్సు చేస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే విద్యాశాఖ ఇలాంటి చర్యలు తీసుకోవడం సరైనది కాదని మండిపడుతున్నారు.

ఆ పోస్టులను ఖాళీల్లో చూపించడం తగదు

- యుఆర్ఎ.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు యుటిఎఫ్, కర్నూలు



స్టడీ లీవ్‌లో ఉన్నటువంటి ఉపాధ్యాయుల సంబంధించిన స్థానాలను కూడా బదిలీల్లో ఖాళీలుగా చూపించడం తగదు. వెంటనే ఈ స్థానాలను ఖాళీలుగా చూపించకుండా ఎత్తివేయాలి. స్టడీ లీవ్ అనంతరం ఉపాధ్యాయుల చేరెందుకు వారి స్థానాలు యధావిధిగా కొనసాగించాలి. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- శేఖర్ నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌టియు, కర్నూలు



స్టడీ లీవ్‌లో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు వారి స్థానాలను బదిలీల్లో చూపించరాదు. యధావిధిగా వారి స్థానాలను అలాగే ఉంచి తిరిగి వారి స్థానాల్లో పోస్టింగ్ పొందేందుకు అవకాశం కల్పించాలి. రాష్ట్ర స్థాయి అధికారులు జోక్యం చేసుకొని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి.


ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

భూమి వ్యవహారంలో
వ్యక్తిపై సామూహిక దాడి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో భూమి వ్యవహారంలో రామ చంద్రారెడ్డిపై శుక్రవారం సామూహిక దాడికి పాల్పడ్డారు. కలుదేవకుంట గ్రామానికి చెందిన కురువ సోమశేఖర్‌కు చెందిన సర్వే నెంబరు 321లోని 1.40 ఎకరాల భూమిని నందవరం మండలం జొహరాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి తన సోదరుడితో కలిసి రెండేళ్ల క్రితం రూ.1.40 కోట్లకు కొనుగోలు చేశారు. అడ్వాన్స్ కింద రూ.80 లక్షలు చెల్లించారని, మిగిలిన డబ్బు ఇవ్వాలని కోరగా ఆ భూమిపై బ్యాంకులో రుణం ఉందని, దానిని కడితేనే రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుందని కొనుగోలు చేసిన వ్యక్తి చెప్పారు. 'ఆ అప్పుతో మీకు సంబంధం లేదు. ముందు మీరు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వాల'ని బెదిరింపులకు దిగారు. కొన్న వ్యక్తి ససేమిరా అనడంతో లాడ్జీ వద్దకు మాట్లాడదామని పిలిచి దాడి చేశారు. దాడిలో గాయపడిన వ్యక్తి సొమ్మసిల్లి పోవడంతో బంధువులు ద్విచక్ర వాహనంపై ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివాంజల్ హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునను పంపించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ఆస్పత్రిలో ఉన్న కారణంగా శనివారం పోలీసు స్టేషన్‌కు వచ్చి మాట్లాడతామని చెప్పడంతో కేసు నమోదు విషయం వాయిదా వేసినట్లు తెలిసింది.

టిడిపి నాయకునికి పరామర్శ


అయ్యప్పను పరామర్శిస్తున్న ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్ద హరివాణం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు హరిజన అయ్యప్పను టిడిపి సీనియర్ నాయ కులు ఉమాపతి నాయుడు పరామర్శించారు. అనా రోగ్యంతో బాధపడుతూ పట్టణంలోని మధు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అయ్యప్పను ఉమాపతి నాయుడు పరామర్శించారు. శుక్రవారం స్వయంగా ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి త్వరగా కోలుకోవాలని సూచించారు. టిడిపి మండల అధ్యక్షులు బిపి.బసవరాజ్, మాజీ ఎంపిటిసి సభ్యులు నాగరాజ్, టిడిపి పెద్దహరివాణం యువ నాయకులు సిద్ధ ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ఖర్చులపై విచారణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అన్ని మండల కేంద్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రస్తుతం విచారణ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం గోనెగండ్లలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను విజిలెన్స్ అధికారులు విచారించారు. మండల స్థాయిలో క్రీడలకు ఎలాంటి సదుపాయాలతో ఏర్పాట్లు చేశారు, ఎన్ని జట్లకు, ఎన్ని క్రీడా పరికరాలు కొనుగోలు చేశారు.. క్రీడా జట్ల సభ్యులకు చేసిన ఏర్పాట్లు తదితర అంశాలపై గ్రామ సచివాలయ కార్యదర్శులను విచారించారు. గ్రామ స్థాయిలో నిర్వహించిన క్రీడలకు సచివాలయ ఖాతాల నుంచి జమ చేసిన రూ.10 వేల నగదుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో లిఖిత పూర్వకంగా వివరాలను తీసుకున్నారు. ఈనెల 20న మరో దఫా విచారణ ఉంటుందని, తప్పకుండా హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపిడిఒ మణి మంజరి, డిప్యూటీ ఎంపిడిఒ అనంతశయన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి

వేసవి దుక్కులు ఉపయోగకరం...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'మే నెలలోనూ రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగానే ఉంటారు. వేసవి దుక్కులు పంటలకు మేలు చేస్తాయి. వేసవి దుక్కులంటే మధ్య వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ప్రత్యేకమైన వ్యవసాయ పరికరాల సహాయంతో నేలను వాలుకు అడ్డంగా దున్నడం. ఇది సాధారణంగా మే నెలలో చేస్తారు. మట్టిని ఏకకాలంలో కిందా, మీదా చేసి నేలలో ఉన్న కలుపు విత్తనాలను, పురుగుల లార్వాను, ప్యూపా దశలను, తెగులు కారక అవశేషాలను బహిర్గతం చేయడం ద్వారా అధిక ఉష్ణోగ్రతలకు వాటిని నిర్వీర్యం చేయడం వేసవి దుక్కుల అంతరార్థం. తొలకరి సమయంలో వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉంచడానికి ఉపయోగపడుతుంది. ఇది నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన వెంటనే పంటలను సకాలంలో విత్తుకోవడానికి వీలు కల్పిస్తుంది' అని ఎఒ అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. వేసవి దుక్కులు, వాటి ఉపయోగాలపై ఆయన మాటల్లోనే...


ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

దుక్కుల సంఖ్య లోతు కలుపు తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా రుతుపవనాలు వచ్చే ముందు 15-20 రోజుల అంతరంలో రెండు వేసవి దుక్కులు దున్నడం మంచిది. దీనితో ప్రాథమిక దుక్కి అయిపోతుంది. తర్వాత మూడో దుక్కి హారో లేదా కల్టివేటర్‌తో ద్వితీయ దుక్కి చేసుకుంటే తొలకరి ప్రారంభమైన వెంటనే విత్తడానికి ప్రధాన పొలం తయారు చేసుకోవచ్చు.

వేసవి లోతు దుక్కుల వల్ల ప్రయోజనాలు

పై పొర మట్టి మీద ఏర్పడిన గట్టి పైపొరను మెత్తగా చేయడం వల్ల నేలలో నీరు ఇంకుడు సామర్థ్యం పెరుగుతుంది. పంట పెరుగుదలకు కావాల్సిన నీరు మొక్క, వేరు భాగంలో నిల్వ చేస్తుంది. వేసవి దుక్కులు నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తాయి. నేలలో గాలి ప్రసారం మెరుగుపడుతుంది. సూక్ష్మజీవుల చర్యలు పెరిగి నేల ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుంది. సేంద్రీయ పదార్థం త్వరగా చివకడం వల్ల మొక్కలకు కావాల్సిన పోషకాల లభ్యత బాగుంటుంది. వాయు ప్రసారం పెరగడం వల్ల కలుపు, పురుగు మందుల అవశేషాలు, మునుపు వేసిన పంటల నుంచి వెలువడే హానికరమైన అల్లెలోపతిక్ రసాయనాలను నిర్వీర్యం చేసేందుకు సహాయ పడుతుంది. వేడి వేసవిలో కీటకాలు, తెగుళ్ల నేల లోపల పొరల్లో నిద్రాణస్థితిలో ఉంటాయి. వేసవి దుక్కి నేల తారుమారు చేయడం వల్ల సూర్య కిరణాలు మట్టి లోపల పొరలకు ప్రవేశించి, కీటకాలు, తెగుళ్ల గుడ్లు, లార్వా, ప్యూపాలను డిహైడ్రేట్ చేసి చంపుతాయి. తద్వారా వేసే పంటపైన కీటకాల ఉధృతి తక్కువ అవుతుంది. వేసవి దుక్కులు దున్నడం వల్ల నెమటోడ్లు నులి పురుగులు, తెగుళ్ల కారక బ్యాక్టీరియా, శిలీంధ్ర భీజాలు నిర్వీర్యం అవుతాయి. తద్వారా పురుగు మందుల వాడకం తగ్గించవచ్చు. లోతుగా దున్ని నేలను తారుమారు చేయడం వల్ల కలుపు మొక్కలు నేల లోపల పొరలకు పోతాయి. గాలి, వెలుతురు లేక మొలకెత్తలేవు. పర్యావసానంగా పంట, కలుపు మొక్కల మధ్య పోటీ తగ్గి, ఉత్పాదకత పెరుగుతుంది.

వేసవి దుక్కులకు అనుకూల పరిస్థితులు

భూమిలో నిల్వ ఉంచుకునే తేమ 25 నుండి 50 శాతం ఉంటే అది దుక్కులు చేసుకోడానికి అనుకూలమైనది. భూమిలో తేమ తక్కువ ఉన్నప్పుడు దుక్కి దున్నితే ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. దుక్కి కూడా బాగుండక భూమి సరిగా గుల్లబారదు. భూమిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు దున్నితే నాగలికి మట్టి అంటుకుంటుంది. కింద ఉన్న మట్టి గట్టి పడి భూమిలో గట్టి పొడలు ఏర్పడతాయి. దుక్కి చేయడం అనేది భూమిలో ఉన్న తేమపై ఆధారపడి ఉంటుంది. తేలిక నేలల్లో కొంచెం ఎక్కువగా ఉన్న కూడా చేసుకోవచ్చు. బరువు నేలల్లో తగినంత తేమ ఉన్నప్పుడు చేసుకోవాలి. ఎక్కువ ఉంటే చేసుకోకూడదు. దుక్కి లోతు పండిచే పంటలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి మూడేళ్లకోసారి పెద్ద మరతో లోతు దుక్కు (30 సెంటీమీటర్ల లోతు వరకు) చేయడం మంచిది. ప్రతేడాది వర్షాలను బట్టి 15-20 సెంటిమీటర్ల లోతు వరకు దున్నుకోవాలి. సాధారణంగా తల్లి వేరు వ్యవస్థ ఉన్న పంటలకు కొంచెం లోతు దుక్కులు అవసరం. పీచు వేరు వ్యవస్థ ఉన్న పంటలకు తక్కువ లోతు దుక్కి సరిపోతుంది. తేలికపాటి నేలల్లో 1-3 సార్లు దున్నితే సరిపోతుంది. కలుపు మొక్కలు, అంతకుముందు పంటల అవశేషాలు ఎక్కువగా ఉంటే భూమిని కనీసం మూడు దఫాలైనా దున్నాలి.

దుక్కి చేసేందుకు వాడాల్సిన పనిముట్లు

పైపైన దుక్కి చేసేందుకు మామూలు నాగలి లేదా చక్రాల గుంటక కానీ వాడాలి. ఎరువును భూమిలో కలియదున్నడానికి ఎద్దులతో లాగే మౌంట్ బోర్డు మరకను వాడాలి. బాగా లోతుకు చేసి నేలను తిరగతోడడానికి ట్రాక్టర్‌తో లాగే మౌల్డ్ బోర్డు మరకను వాడాలి. అధునాతనంగా వచ్చిన ట్రాక్టర్‌తో లాగే పెద్ద మడకలు కానీ రోటోవేటర్ వంటి వ్యవసాయ పనిముట్లు ఉపయోగించుకోవచ్చు.


ఎఒ అశోక్ కుమార్‌రెడ్డి

వేసవి దుక్కుల వల్ల నేల బాగా గుల్లబారుతుంది. తర్వాత పడే వర్షపు నీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవచ్చు. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు నేలను లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల నేల కోతను, భూమిపై త్వరలో భూసారాన్ని కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు. భూమిని ఒక అడుగు లోతు వరకు దున్నుకుంటే విత్తనం మొలకెత్తి వేర్లు సులభంగా భూమిలోకి దిగి భూమిలో ఉండే పోషకాలను గ్రహించి మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది. లోతు దుక్కుల వల్ల భూమిలో నీరు ఉండి తేమ శాతం పెరగడం వల్ల సేంద్రీయ పదార్థాలు త్వరగా కుళ్లి పోషకాల రూపంలో అందుబాటులోకి వస్తాయి. భూమిలో దాగి ఉన్న చీడపీడలు కోత దశలో పురుగులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, సిద్ధ భీజాలు కలుపు మొక్కల విత్తనాలు ఎండవేడికి లోనై చాలా వరకు నశిస్తాయి. వేసవి దుక్కుల వల్ల కలుపు మొక్కలు వేళ్లతో సహా పెకిలించి భూమిలో కలిసిపోతాయి. సేంద్రీయ పదార్థంగా ఏర్పడతాయి.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

- టిపిఆర్ఒ శ్రీనివాసులు


ప్రజాశక్తి - ఆదోని



స్వయం ఉపాధి పథకాల కోసం మైనార్టీలకు బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆదోని మున్సిపల్ టిపిఆర్ఒ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఆదోని పట్టణానికి స్వయం ఉపాధి కింద 29 యూనిట్లు మంజూరయినట్లు తెలిపారు. నాలుగు విధాల స్లాబుల్లో రాయితీతో కూడిన రుణం మంజూరవుతుందన్నారు. మొదటి స్లాబ్ కింద 15 మందికి రూ.లక్ష, రెండో స్లాబ్ కింద 10 మందికి రూ.1 నుంచి 3 లక్షలు, మూడో స్లాబ్ కింద ముగ్గురికి రూ.3 నుంచి 5 లక్షలు, నాలుగో స్లాబ్ కింద ఒకరికి రూ.8 లక్షల చొప్పున యూనిట్లకు రుణ మంజూరు ఉంటుందని తెలిపారు. ఔత్సాహికులు ఆన్ లైన్ ద్వారా ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ అప్‌లోడ్ చేసిన తర్వాత ప్రింట్ రెండు కాపీలు దరఖాస్తుదారులు తీసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలో బ్యాంకు, మున్సిపల్ కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.


రామాలయంలో చోరీ

- వెండి కిరీటాలు, ఆభరణం అపహరణ


ఆలయంలోని విగ్రహాలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం కొట్టాల గ్రామంలో గురువారం రాత్రి రామాలయంలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులు కుమారరెడ్డి మాట్లాడారు. నాలుగు వెండి కిరీటాలు, స్వామివారి ఆభరణం దొంగిలించినట్లు చెప్పారు. అవి సుమారు 4 కిలోలు ఉంటాయని తెలిపారు. గురువారం దేవాలయ ప్రాంతంలో మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో చోరీ జరిగి ఉంటుందని చెప్పారు. సాయంత్రం గ్రామంలో వివాహం జరిగిన కొత్త జంట స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చారని, అప్పుడు దేవాలయంలోకి వెళ్లే సమయంలో పూజారి సావిత్రమ్మ విషయాన్ని గమనించి గ్రామస్తులకు తెలిపినట్లు వివరించారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని తెలిపారు. గ్రామస్తులతో కలిసి శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.


భూమిపూజ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

భవన నిర్మాణంతో ఇబ్బందులు దూరం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కళాశాల నూతన భవన నిర్మాణంతో విద్యార్థినులకు ఇక ఇబ్బందులు ఉండవని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాల వద్ద కళాశాల భవన నిర్మాణానికి బిజెపి ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అందుకు భవన నిర్మాణమే నిదర్శనమన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.22 కోట్లతో భవన నిర్మాణం నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు త్వరలోనే తొలగనున్నాయని పేర్కొన్నారు. ఎంఇఒ మొయినుద్దీన్, ప్రిన్సిపల్ శాంతి, ఎఇ రంగరాజు, మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, గోపాల్ రెడ్డి, చిలకలడోన మాజీ సర్పంచి నర్సన్న, నాయకులు పవన్, గోపాల్, వీరేష్, మాలపల్లి లక్ష్మన్న పాల్గొన్నారు.

ఇంటికి పెట్రోల్‌తో నిప్పు

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఆదోని


వివరాలు వెల్లడిస్తున్న శాంత రాజు

ఆదోని పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల వివరాల మేరకు... అరుణ్ జ్యోతి నగర్‌లోని శాంతరాజు ఇంటిపై గురువారం అర్ధరాత్రి అదే కాలనీకి చెందిన కిరణ్ అనే వ్యక్తి పెట్రోల్ పోశాడని బాధితులు తెలిపారు. కిటికీలు తెరిచి ఉండడం వల్ల ఇంట్లో నిద్రిస్తున్న వారిపై పెట్రోలు పడింది. అగ్గిపుల్లతో నిప్పంటించడంతో మంటలు వ్యాప్తి చెందాయి. ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకున్నామని బాధితులు పేర్కొన్నారు. మెలకువతో బయటికి పరుగులు తీశామని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోయేవని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మనస్పర్థలను మనస్సులో ఉంచుకొని నిందితుడు కిరణ్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితునిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


కాలిపోయిన సామగ్రి



సైన్యాన్ని కించపరిచిన వారిని శిక్షించాలి

- ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

భారత సైన్యాన్ని కించపరిచేలా మాట్లాడిన మధ్యప్రదేశ్ మంత్రి అజయ్ షాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ విజయంలో కీలకపాత్ర వహించిన దేశ వీరనారి కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరిగా సంబోధించడం ఇతడి నీచత్వానికి, నికృష్ట మనస్తత్వానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైన్యంపై గౌరవం లేని దేశద్రోహిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిని ఇలాగే వదిలేస్తే ప్రపంచవ్యాప్తంగా దేశానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. ముస్లింలపై ద్వేషంతోనే బతికి బట్ట కడుతున్న కొన్ని పార్టీలు, సంఘాలు వారి వైఖరిని మార్చుకొని దేశంలో ఐకమత్యం పెంచి దేశాన్ని మరింత బలంగా తయారు చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు.

దోమల వ్యాప్తిని అరికడదాం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి


- ఘనంగా జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - ఆదోని


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

దోమల వ్యాప్తిని అరికట్టి డెంగీ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి శ్రీనివాస భవన్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్థోవైరస్ జాతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. ఇది మనిషి నుండి మనిషికి దోమల ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు. ఈ జాతి దోమపై నల్లని, తెల్లని చారలు ఉండడం వల్ల దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారన్నారు. ఆకస్మికంగా తీవ్ర జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు, కంటి నొప్పులు, కంటి కదలిక తగ్గడం, నొప్పి, ఒక్కోసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు ఏర్పడడం ఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఇంటి లోపల, ఇంటి ఆవరణలో ఎక్కడా మూత లేకుండా కొద్దిగా నీళ్లు కూడా నిల్వ ఉండకుండ చూసుకోవాలని సూచించారు. పూలకుండీల కింద, పెంకులు, కొబ్బరి బోండాలు, రుబ్బురోళ్లు, పనికిరాని వస్తువులు, పాత టైర్లు, తాగి పడేసిన టీ కప్పులు, సీసాలు, నీటి ట్యాంకులు, సంపులు, కూలర్లు, నీటి గుంటల్లో ఈ దోమ ఉత్పత్తి అవుతుందన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. సబ్ యూనిట్ ఆఫీసర్ మంజునాథ్, సూపర్ వైజర్ మేరీ ఉన్నారు. **చిప్పగిరి** ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 'దోమలు నివారిద్దాం' అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డాక్టర్లు అప్రోజ్ జహాన్, పార్వతమ్మ మాట్లాడుతూ... ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు రామ్మోహన్, పద్మావతి పాల్గొన్నారు.


చిప్పగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


వధూవరులతో ఉన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని సిఎస్ఐ చర్చిలో జరిగిన వివాహ వేడుకలో శుక్రవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వరుడు ప్రదీప్ తండ్రి మద్రి ప్రభుదాస్ ఆహ్వానం మేరకు హాజరైన ఆయనకు పెళ్లి పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. కొత్త దంపతులు సంగీత, ప్రదీప్‌కు తలంబ్రాలు వేసి ఆశీర్వదించారు. వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న యువత

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. వివిధ గ్రామాల నుంచి 161 మంది దాతలు తమ రక్తాన్ని దానం చేశారు. మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీరేష్, జగదీష్, మధు, చిదంబర గౌడ్, సాయి మాట్లాడారు. తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, సురేష్, ప్రతాప్ మాట్లాడుతూ... ప్రతి 21 రోజులకు రక్త మార్పిడి చేయించుకునే తలసేమియా పిల్లల కోసం మనం ఉన్నామంటూ చేస్తున్న మహాయజ్ఞం ఈ రక్తదాన శిబిరమని చెప్పారు. ప్రతిఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి తలసేమియా బాధితులకు అండగా నిలవాలని కోరారు.

సిఎం పర్యటన షెడ్యూలు ఇలా...

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఉదయం 11.25 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధులు ఇతర ఉన్నత అధికారులను కలిసి నేరుగా రోడ్డు మార్గంలో రైతు బజార్ సి.క్యాంపు సెంటర్‌కు చేరుకుంటారు. ఉదయం 11:55 గంటలకు రైతు బజారులో రైతులు , పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం అక్కడి నుండి నేరుగా కేంద్రీయ విద్యాలయ సమీపంలోని స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర పార్కుకు చేరుకుంటారు. అక్కడే స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర పార్కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రజావేదికకు చేరుకుంటారు. ఒంటిగంట నుండి రెండు గంటల వరకు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం రెండు నుండి మూడు గంటల వరకు ప్రజా వేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 3.35 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5.25 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం నుండి నేరుగా బేగంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్తారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ములుగుందం గ్రామ సచివాలయం ముందు వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాదాపు 8 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు వేసుకోవడానికి టార్పాలిన్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలని అధికారులను కోరారు. కూలీలకు మజ్జిగ సరఫరా, రవాణా చార్జీలు కల్పించాలని తెలిపారు. రెండు పూట్ల పని విధానం రద్దు చేసి, పాత పద్ధతిని కొనసాగించాలని పేర్కొన్నారు. రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం విఆర్ఒ సుప్రియకు వినతిపత్రం అందజేశారు. వ్యకాస నాయకులు శేఖర్, నరసింహులు, జయ రాముడు, సుంకన్న, లక్ష్మన్న, కూలీలు వీర కాంతమ్మ, లక్ష్మి, మహాలింగమ్మ పాల్గొన్నారు.


విఆర్ఒ సుప్రియకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

లేబర్ కోడులను రద్దు చేయాలి

ప్రజాశక్తి- సి బెళగల్

కార్మిక హక్కులను, సమ్మె హక్కులను, ట్రేడ్ యూనియన్ హక్కులను, కంపెనీలను ప్రశ్నించే హక్కులను లేకుండా మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులను తక్షణమే రద్దు చేయాలనీ సిఐటియు నాయకులు మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్‌టిఆర్ పార్కులో ఆశా, అంగన్వాడీ, స్వచ్ఛ కార్మికులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ వేల సంవత్సరాలనుండి పోరాట ఫలితంగా 44 లేబర్ కోడులను సాధించుకున్నామని ప్రస్తుతం నాలుగు లేబర్ కోడులు మాత్రమే చేయడం హక్కులను హరించడమేనన్నారు. అందుకు గాను కార్మికులు ఐక్యమావ్వాలన్నారు. కార్మికులకు వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, సమస్యలన్నింటికి పరిష్కరించాలని ఉద్యమ బాట ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అమ్మ హాస్పిటల్ సర్కిల్ వరకు ఉమ్మడి కూటమి పార్టీ నాయ కులు, కార్యకర్తలతో కలిసి తిరంగ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు అర్బన్ ఉమ్మడి కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి టిజి భరత్

ప్రజాశక్తిగీకర్నూలు క్రైమ్

కర్నూలులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ పరిశీలించారు. సి.క్యాంపు రైతు బజార్లో మినిట్ టూ మినిట్ సీఎం చంద్రబాబు కార్యక్రమానికి అనుగుణంగా ఏర్పాట్లు ఎలా చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య పనులు వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రైతు బజార్ విస్తరణకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చిస్తానని మంత్రి తెలిపారు.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- వెల్దుర్తి



పదవ తరగతి ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు... రామళ్లకోట గ్రామానికి చెందిన రైతు ఇదస్ బాష కూతురు కరిష్మాబికి(15) ఏప్రిల్ 23న వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో 361 మార్కులు వచ్చాయి. తోటి విద్యార్థుల కన్నా తక్కువ మార్కులు వచ్చాయని మనస్థాపానికి గురై క్షణికావేశంలో ఇంట్లో అందరూ పొలం పనులకు వెళ్లడంతో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పుకు ఉన్న కొండికి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన ఇంటిపక్కల వారు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారి బంధువుల సహాయంతో ప్రైవేటు వాహనంలో వెల్దుర్తి సిహెచ్‌సికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వెల్దుర్తి పోలీసులు తెలిపారు.

కోడుమూరులో జాతీయ డెంగీ దినోత్సవం పై అవగాహన సదస్సు, ర్యాలీ

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్



-కోడుమూరు ప్రదర్శనలో వైద్యాధికారులు

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా డెంగీ వ్యాధి పై అవగాహన ర్యాలీ కోడుమూరు పట్టణ కోట్ల సర్కిల్, పాత బస్టాండ్ ,అంబేద్కర్ సర్కిల్,కొత్త బస్టాండ్ మీదుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు నిర్వహించారు. సమన్వయ సమావేశం కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోడుమూరు వైద్యాధికారి డాక్టర్ మధన్‌శేఖర్, మండల ప్రజాపరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రామపంచాయతీ కోడుమూరు ఎన్.అజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ మధన్ శేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ డెంగీ దినోత్సవం మూడు పద్ధతులను పాటించాలన్నారు. వ్యాధిని నివారించండం, పరిశీలించండం, శుభ్రం చేయడం ప్రధాన మన్నారు. నీటితొట్లపై మూతలు పెట్టాలని, తరుచూ శుభ్రం చేయాలని నినాదంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. డెంగీ జ్వరం ఎడిఎస్ ఈజిప్ట్ దోమ పగటి పూట కుట్టడం ద్వారా సంభవిస్తుందన్నారు. తీవ్రమైన జ్వరం ,తలనొప్పి, కంటి కదలికతో కళ్ళ వెనుక నొప్పి, ఛాతి , ఇతర అవయవాలపై దద్దుర్లు, వాంతులు కావడం లక్షణాలు ఉన్నట్లయితే డెంగ్యూ జ్వరం అని అనుమాన పడి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలన్నారు. అలా చేయని యెడల డెంగీ వ్యాధి డెంగీ హేమరేజిక్ , డెంగ్యూ షాక్ సిండ్రోమ్ గా మారి తీవ్రమైన నిరంతర కండనొప్పులు, ముక్కు ,నోరు, చిగుళ్ళు చర్మం పై దద్దుర్ల నుండి రక్తస్రావం తరచూ రక్తంతో కూడిన వాంతులు, వేగవంతమైన పల్స్, శ్వాస సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో చేరవేస్తుందని తెలిపినారు. డెంగీ వ్యాధిని కలగ జేయు దోమలు సాధారణంగా మంచి నీటిలో పెరుగుతాయని, డెంగీ జ్వరం నివారణకు ముందు జాగ్రత్త చర్యలుగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి కె. నరసప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్లు, కె. కమాల్ సాహెబ్ , ఉమాబాయి, కోడుమూరు పంచాయతీ సెక్రెటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు , ప్రజలు పాల్గొన్నారు.

డెంగీ నివారణ చర్యలు చేపట్టాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి.శాంతి కళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జాతీయ డెంగీ దినోత్సవం" సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం శ్రీరాం నగర్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి శాంతి కళ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగీ దినోత్సవం జరుపుకొంటున్నామని, అందులో భాగంగా ఈ సంవత్సరం 'పరిశీలించండి - శుభ్రం చేయండి - మూతలు పెట్టండి ' అను నినాదంతో నివారణ నియంత్రణ చర్యలు వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నామని తెలిపారు.

వ్యాధి లక్షణాలు: ఉన్నట్టుండి జ్వరం అధిక ఉష్ణోగ్రతతో వచ్చుట ,తలనొప్పి అధికంగా రావడం, కంటి లోపల నొప్పి కంటి కదలికలు తగ్గడం, కన్ను కదలినప్పుడు నొప్పి ఎక్కువ అగుట, కండరాలు, కీళ్ల నొప్పి, వాంతి అగునట్లు అనిపించడం, నోరు ఎండిపోవుట, ఎక్కువ దాహం కావడం.

వ్యాధి వ్యాపించే విధానం: ఈ వ్యాధి ఆర్బో వైరస్ వలన సంక్రమించునని, ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి ఎడిస్ ఈజిప్టై అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ దోమలు పగలు కుడుతాయన్నారు. ఈ రకమైన దోమలు మన ఇంటి పరిసరాలలో నీరు నిలుచుటకు అవకాశం ఉండి, ఆ నీరు కనీసం వారం రోజులు నిల్వ ఉన్నచో ఈ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఈ దోమలు గుడ్డు పెట్టి పెరుగుటకు ఈ క్రింద తెలిపిన వస్తువులు / పరిసరాలు అనుకూలమైనవిడి ఉంటాయన్నారు. ఎయిర్ కూలర్స్, రెఫ్రిజిరేటర్స్ గల డ్రిప్ ఫ్యాన్, పూల కుండిలా కింద గల శాసర్లు, బయట పెట్టిన టైర్లు, మూతలు పెట్టని నీరు, నిల్వ చేసే తొట్టీలు, కుండీలు, ఫౌంటెన్స్, ఖాళీ డ్రమ్ములు, సన్ షేడ్స్ పై నిల్చిన వాన నీరు.

నివారణ చర్యలు: దోమ తెరలు వాడడం,పొడుగు గల దుస్తులు ధరించడం, నీరు నిల్వ లేకుండా చేసుకోవడం. డే డ్రై డే పాటించడం. ఈ కార్యక్రమం లో డిపిఎంఒ డాక్టర్ ఉమా , వైద్యాధికారి రాజా నందిని , డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి , ఆరోగ్య విద్యాభోదకురాలు పద్మావతి , సిహెచ్ఒ లక్ష్మీదేవి , ప్రాజెక్సనిస్ట్ ఖలీల్ , ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

అధికరక్తపోటు-తీసుకోవల్సిన జాగ్రత్తలు

మెడికవర్ వైద్యుల సూచనలు -సలహాలు



ప్రస్తుతం మారిన పరిస్థితులలో ఎక్కువ మందికి దీర్ఘకాలిక వ్యాధులలో ఒకటైన అధికర్తపోటు వస్తుందని, అందుకు తగిన జాగ్రత్తలు, వైద్యులు సలహాలు పాటించాలని కర్నూలు మెడికవర్ వైద్యులు డాక్టర్ ఎన్.చైతన్య కుమార్, డాక్టర్ బిఎస్. ప్రవీణ్ కుమార్ , డాక్టర్ సిఎస్. తేజ నందన్ రెడ్డిలు తెలిపారు. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) గురించి వారు తెలిపిన వివరాల ప్రకారం... ..ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు పెరుగుతున్నాయి. వాటిలో అధిక రక్తపోటు ఒకటి. అధిక రక్తపోటు ఒకసారి వస్తే జీవితాంతం ఉంటుంది. మందులు , సరైన ఆహారంతో దానిని నియంత్రించవచ్చు. అధిక రక్తపోటు వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. చాలా మంది గుండెపోటుతో మరణిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, ఈ సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

హైపర్ టెన్షన్ యొక్క లక్షణాలు

కొంతమందికి ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చు.తీవ్రమైన తలనొప్పి, ఛాతి నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం , వాంతులు, అస్పష్టమైన దృష్టి లేదా ఇతర దృష్టి మార్పులు, ఆందోళన , గందరగోళం చెవుల్లో శబ్దాలు, ముక్కు రక్తస్రావం వంటి లక్షణాలుంటాయి.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఆహారంలో ఉప్పును బాగా తగ్గించడం. శారీరకంగా చురుకుగా ఉండటం. ధూమపానం , మద్యపానాన్ని పూర్తిగా మానేయడం. అధిక బరువు ఉంటే తగ్గడం. కూరగాయలు , పండ్లు ఎక్కువగా తీసుకోవడం. గంటల తరబడి కూర్చోకుండా ఉండటం. నడక, పరుగు, ఈత, డ్యాన్స్ లేదా బరువులు ఎత్తడం వంటి వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయడం (ప్రతి వారం 2 లేదా అంతకంటే ఎక్కువ రోజులు).

సిఎం హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిసిసి నంద్యాల జిల్లా అధ్యక్షులు జె. లక్ష్మీనరసింహ యాదవ్, డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబును ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గంలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు నెరవేరుస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు.

నిద్రపోతున్న ప్రభుత్వాన్ని మేల్కొలపడం కోసం వారు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ లేఖ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి తేదీన ఇంటి వద్దనే లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేయడం హర్షణీయమని, కానీ మిగతా హామీలు అటకెక్కించారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ అమలు కాలేదన్నారు. యువగళం కింద నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి హామీ అమలు కాలేదన్నారు. 77 జీవో రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు రద్దు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 450 కి పైగా బీసీ ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ కాలేజ్ హాస్టల్ విద్యార్థుల వసతి గృహాలు సొంత భవనాలు లేవని, వెంటనే భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు విభిన్న ప్రతిభావంతులకు బ్యాక్ లాక్ ఉద్యోగాల ఊసే లేదన్నారు. తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000 ఇస్తామన్నారు.ఇవ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయం హామీ అమలు కాలేదన్నారు. 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 హామీ అమలు కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదన్నారు. పైన పేర్కొన్న హామీలను వీలైనంత త్వరగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, ఉపాధ్యక్షులు మిద్దెల నాగలింగం, ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్, ఉపాధ్యక్షులు ఉస్మాన్‌బాష, ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ వడ్డే రాజశేఖర్, సుంకన్న గౌడ్, అబ్దుల్ ముజీబ్, ఆర్ గోపీనాథ్ రావు, బోయ రమణ, బి. హుస్సేన్ బాష, రహ్మాన్ భాష, షేక్ జాకీర్ హుస్సేన్, కురువ రవి కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

పొదుపు మహిళలను ఆదుకోండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : మహిళా మార్ట్ పేరుతో రూ.60 లక్షలకు పైగా వసూలు చేసి మహిళామార్ట్ ఏర్పాటు చేసి దివాళా తీయించారు. పొదుపు మహిళలను ఆదుకోవాలని ముఖ్యమంత్రిగా కర్నూలు సిటీలో ఉన్నరైతు బజార్ సి.క్యాంప్ సందర్శనకు వస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు, రైతు బజార్ పక్కనే మెయిన్ రోడ్‌లో మూతబడ్డ మహిళా మార్టును సందర్శించి కారణాలు కనుక్కోగలరు. గత ప్రభుత్వంలో మహిళమార్ట్ ఏర్పాటుకు పొదుపు గ్రూపుల నుండి రూ60 లక్షల పైనే వసూలు చేసి మెప్మా జిల్లా అధికారులు మార్ట్ ప్రారంభించారు. అనతికాలంలోనే దివాళా తీయించారు. మీరు పొదుపు మహిళలను లక్షాధికారులను చేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలను చేస్తామంటున్నారు సంతోషమన్నారు. మహిళ మార్ట్ కు చెల్లించిన రూ.60 లక్షలు పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలన్నారు. మహిళా మార్ట్ ఏర్పాటు చేసి దివాళా తీయించారు. దీనికి సమాధానం మెప్మా జిల్లా అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. మెప్మ ఎండి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రాథమిక విచారణ చేశారే తప్ప డబ్బులు తిరిగి చెల్లించలేదన్నారు.సిఎం రూ 60 లక్షల వాటా షేర్ పొదుపు సభ్యులకు ఇప్పించాలన్నారు. మహిళా మార్ట్‌ను దివాళా తీయించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కర్నూలు నగరం పొదుపు గ్రూపుల సమన్వయ కమిటీ కోరింది.